

ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

'ఉద్యోగం ఉద్యోగం అని కలవరించి పోయారు తీరా అది కాస్తా వచ్చేప్పటికి చప్పబడి పోయారేంటి!...'

'లేనిదానికోసం తాపత్రయపడటం సహజం అయితే కష్టపడి ప్రయత్నం చేసి సాధించటంలో వుండే ఆనందం, దయాధర్మ భిక్షంగా రావటంలో వుండదు...'

'మీరనుకున్నంత తేలికగా మాత్రం యీ ఉద్యోగం రాలేదు...'

'ఈ ఉద్యోగంకోసం నా పరువు ప్రతిష్ఠలు యెంతవరకు ఖర్చయినాయో అని నా ఆవేదన...'

'మీరంటున్న దేమిటో నాకర్థం కావటంలేదు. నేను చెయ్యరాని పనేమి చెయ్యలేదు భార్యగా నా బాధ్యత సక్రమంగా నెరవేర్చుకున్నాను. మీకు ఉద్యోగం యిప్పించాను. మీకోసం నేను ఉద్యోగం చెయ్యటం మానుకుంటున్నాను... అదే నేను చేసిన తప్పవుతే

మీరు నన్ను క్షమిస్తారనుకుంటాను...'

'...సుగుణా, నామతి పోతోంది. నువ్వేం చేశావో చెప్పు...' 'నేను యేం చేశానని మీరనుకుంటున్నారో అది ముందర నాకు చెప్పండి...'

'నేను నిన్ను గురించి యేమనుకున్నా ఫరవాలేదు. కాని లోకం నిన్ను గురించి యింకోవిధంగా అనుకోవటం నేను భరించలేను...'

'నామీద మీకున్న అభిమానానికి చాలా చాలా కృతజ్ఞతలు...'

'సుగుణా నువ్వు నన్ను అపార్థం చేసుకోవద్దు. నీమీద నాకు పూర్తి విశ్వాసం వుంది...'

"నామీద మీకు అంతవిశ్వాసం ఉండబట్టే, నేను యి త ధైర్యంగా చెయ్యగలిగాను...'

"నావిశ్వాసం ఆసరాచేసుకుని నువ్వు చెయ్యకూడని పని చేస్తావని నేను అనుకోవటం లేదు..."

"మీకా విశ్వాసం పోయిన నాడు నే నేంచేసినా, మీకు అది చెయ్యకూడని పనిగానే కనిపిస్తుంది..."

'నువ్వేం చేశావో చెప్పమని అడగటానికి ధైర్యం చాలకపోయినా నువ్వు చెబుతావనే విశ్వాసం మాత్రం నాకు గట్టిగా వుంది...'

'నాకు తెలుసుకోవాలనే పట్టుదల వున్నప్పుడు చెప్పకపోవాలనే దురుద్దేశం మాత్రం నాలో లేదు...'

'నువ్వు చెప్పకపోయినంత మాత్రాన నీమీద నాకున్న విశ్వాసం సడలుతుందని నువ్వనుకుంటావని నేను ఊహించటం లేదు...'

'మీకు నామీద వున్న విశ్వాసం యెంత గాఢంగా వుందో తెలుసుకోవటానికి నా సహనాన్ని మీరు పరీక్ష చేస్తున్నారనుకుంటాను...'

'నేను యెంతో ఆదుర్దాగా వేస్తున్న ప్రశ్నలకు యింత తాపీగా సమాధానాలు యిస్తూ ముందర నా సహనాన్ని నువ్వు పరీక్ష చేస్తున్నావు...'

'మీ సహనమే నాకు రక్ష. మీ విశ్వాసమే నాకు అండ..." ఈ రెండూ ఆసరాచేసుకుని సూటిగా గదిలోకి వెళ్ళిపోయాను. ఆయన వంటరిగా సోఫాలో కూర్చుని వున్నాడు. నేనూ వెళ్ళి ఆయన ప్రక్కగా కూర్చున్నాను. ఆయన కళ్ళల్లో కళ్ళుపెట్టి చూశాను. ఆయన విలవిలలాడిపోయాడు. నన్ను దగ్గరకు తీసుకుందామనే ఆవేశంతో కొంచెం ముందుకు వొరిగాడు...ముందర నేను వచ్చిన పని పూర్తి కావాలి. తర్వాత మీరు కోరిన పనిపూర్తి అవుతుంది అన్నాను...'

'ఆ తర్వాత...'

'అదుగో మళ్ళీ మీ సహనం అంతరిస్తోంది...'

"నా సహనం అంతరించటం లేదు తెలుసుకోవాలనే కుతూహలం ముందుకు వస్తోంది, అంతే..." తాపీగా అన్నాడు మోహన్.

'నామీద ఆయనకు పూర్తి విశ్వాసం కలిగింది. నేను కలిగించాను నామాటల్లో ఆయనకు యేదో ఆకర్షణ కనిపించింది. అదే ఆయన బలహీనత...'

'విశ్వాసం వుండటం బలహీనతే అంటావా...'

"ఆయనకు నామీద ఆ క్షణాన కలిగిన విశ్వాసం బలహీనతే అంటాను..." ఆమె సూటిగా అతని కళ్ళల్లోకిచూసింది.

'చప్పున మీకు ఉద్యోగానికి ఆర్డరు కాగితం యిచ్చేశాడు. నేను ఒక తీర్చలేని వాగ్దానాన్ని చేసివచ్చాను. అది ఆయన నమ్మాడు. అంతే...'

'నమ్మినవాన్ని మోసం చెయ్యటం మహాదారుణం. నువ్వు చేసిన వాగ్దానాన్ని నెరవేర్చటం నీ విద్యుక్త ధర్మం. నువ్వెళ్ళు...'

'మతుండి మాట్లాడుతున్నారా...'

'నాక్కాదు వుండాల్సింది మతి. నీకు. నీ కుండాలి ఆ మతి ఆ వాగ్దానం చేసినప్పుడు... ఆ తీర్చలేని వాగ్దానం చేసినప్పుడు ... ఒకర్ని మోసంచేసి మనం లాభంపొందటం మహాదారుణం. నేను యిలాంటి దాన్ని సహించలేను...'

'ఉద్యోగం ఉద్యోగం అని పగలూ రాత్రిళ్ళు కలవరించిపోయారే. తీరా చేతికొచ్చిన తర్వాత జారవిడుస్తారా...'

'చాలామందిఉద్యోగం కేవలంజీవితం గడవటానికే చేస్తారు. మనకు అలాంటి అవసరం ప్రస్తుతం కనిపించటంలేదు. అయినా నేను ఒక ఉద్యోగం చెయ్యాలనే పట్టుదల పట్టింది కేవలం నా వ్యక్తిత్వాన్ని పెంచుకోవటానికి, లోకందృష్టిలో నేను కూడా సమర్థున్ని అనిపించుకోవటానికి. నాకు ఆత్మవిశ్వాసంలేని పని యేదీ చెయ్యను. చెయ్యలేను కూడా...'

'మీరు చాలా పొరపాటు పడుతున్నారు... ఈ ఉద్యోగం మీకెలా వచ్చిందో యెవ్వరికీ తెలీదు...అయినా నోరు మెదపలేదు. ఉద్యోగం యివ్వటం ఆయన వంతుగాని తీసెయ్యటం ఆయన తరంకాదు...''

'అందుకని...' చప్పున ఆగేశాడు ఎటూతోచక.

'ఎందుకు అంత యిదయిపోతున్నారు. మీకు అవమానం కలిగించే పని యెన్నడూ చెయ్యనని చెప్పాగా. తర్వాత యేం జరిగిందో చెపుతా పట్టండి... ఆయన దగ్గర ఆర్డరు కాగితం తీసుకు వచ్చానేగాని నా మనస్సు మనస్సులో లేదు. కొయ్యబారిపోయాను. నేనుచేసిన పని సరిఅయినదికాదని నా అంతరాత్మ నాకు చెపుతోంది. మర్నాడు వస్తానన్న టైముకు సూటిగా ఆయనింటికి వెళ్ళాను. ఆయన గదిలో ఒంటరిగా సోఫాలో కూర్చున్నాడు. నేనూ వెళ్ళి ఆయన ప్రక్కనే కూర్చున్నాను...''

'ఆ...' మొహాన కారుతున్న చెమటలు తుడుచుకుంటూ తెరిచిన నోరు మూయకండా సుగుణ మొహంలోకి శూన్యంగా చూస్తున్నాడు.



'...నేను తీర్చలేని వాగ్దానాన్ని ముందు వెనకలు ఆలోచించకుండా చేశాను క్షమించండి. ఈ ఆర్డరు కాగితం మీరే వుంచుకోండి. మావారికి ఉద్యోగం అక్కర్లేదు... అని గబగబ అనేసి చివాలున లేచాను... చప్పున నా చెయ్యి పట్టుకున్నాడు...' ఆమెకు దుఃఖం ఆగలేదు.

'రాస్కెల్... త...ర్వా...త...'

'అమ్మాయి కూర్చో అన్నాడు ... నువ్వు తొందరపడి యిక్కడికి వచ్చావు. ఎవరో ఏదో చెపితే నమ్మి యిట్లా రాకూడదు. మోహన్ రిటెన్ టెస్టు బాగా రాశాడు. ఇంటర్వ్యూలో కూడా ఫస్టే వచ్చాడు. అతనికి ఉద్యోగం ఇవ్వటానికి బోర్డు నిర్ణయించింది. అయితే నీ మూలాన నీ భర్తకు ఉద్యోగం వచ్చిందని నువ్వనుకుంటే నాకేమి అభ్యంతరం లేదు. నా బలహీనతవలన ఆ ఉద్యోగం వస్తుందనే నీ నమ్మకాన్ని తోసిపుచ్చటం నాకిష్టంలేక అట్లా చేశాను. అంతే...' ఆ సమయంలో నా మనసు ఎట్లావుందో యిప్పుడు చెప్పటం నాతరం కాదు... ఇహ ఈ ఉద్యోగాన్ని గురించి అపోహలన్నీ తొలగిపోయినట్టేగా...' ఆయాసపడుతూ అన్నది.

'ఇది కూడా నన్ను నమ్మమంటావా...' ప్రాధేయంగా అడిగాడు.

"మీ విశ్వాసమే నాకు పెద్దరక్ష...' అంతకంటె ప్రాధేయంగా అన్నది సుగుణ.